దోస్త్‌తోనే డిగ్రీ ప్రవేశాలు

- మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ
- ఈ నెల 29తో ముగియనున్న తొలి విడత రిజిస్ట్రేషన్లు
- ఈ నెల 20 నుంచి 30 తేదీ వరకు వెబ్ ఆప్షన్లు
- జూన్ 6న సీట్ల కేటాయింపు
- జూన్ 7 నుంచి 12 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్
- రూ.400తో జూన్ 6 నుంచి 13 వరకు రెండో దశ రిజిస్ట్రేషన్లు
- ఏయేటికాయేడు పెరుగుతున్న సీట్ల భర్తీ
- సంగారెడ్డి జిల్లాలో మొత్తం 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు
- గతేడాది ప్రభుత్వ కళాశాలల్లో 4200 సీట్లు
- విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



దోస్త్ వెబ్‌సైట్ ఫొటో

సంగారెడ్డి కలెక్టరేట్, మే 17 : ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ మేరకు దోస్త్ కన్వీనర్, చైర్మన్ లింబాద్రి కమిటీ ఆధ్వర్యంలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, మహిళా విశ్వ విద్యాలయం, జేఎన్‌టీయూ యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలకు దోస్త్ ద్వారా ప్రవేశాలను కల్పించనున్నారు. జిల్లాలో మొత్తం 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా వాటిలో గతేడాది 4,200 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ విద్యా సంవత్సరం మరిన్ని సీట్లను పెంచే అవకాశం ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఉన్నత విద్యను అందించే కళాశాలల అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు తీసుకోడంతో ప్రభుత్వ విద్యకు బలోపేతం అవుతున్నది. రాష్ట్రంలోని 9 యూనివర్సిటీల పరిధిలో గల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా ప్రవేశాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 142 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా, వాటితో పాటు అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లోనూ దోస్త్ ద్వారా ఆన్‌లైన్ ప్రవేశాలను చేపడుతున్నారు. దీంతో ఆయా కళాశాలకు ఉన్నత విద్యామండలి సీట్లను కేటాయిస్తుంది. దోస్త్ ద్వారా ప్రవేశాలు ప్రారంభించిన ప్పటి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీట్ల సంఖ్యను పెంచుతూ ప్రవేశాలు మెరుగుపడేలా చేసింది. గత ఐదేండ్లుగా దోస్త్ వచ్చిన ప్పటి నుంచి ప్రభుత్వ కళాశాలల సీట్ల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది.

ప్రభుత్వ కళాశాల్లోనే అత్యున్నత ప్రమాణాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నారు. ముఖ్యంగా యూజీసీ నిబంధనల మేరకు నిష్ణాతులైన అధ్యాపకుల ద్వారా విద్యా భోదన జరుగుతున్నది. అంతేకాకుండా జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ఆకర్షణీయమైన జిజ్ఞాస, యువతరంగం వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యార్థి ఆకర్షిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మొత్తం మీద ఏయేటికాయేడు సీట్ల భర్తీ పెరుగుతున్నది. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 650 నుంచి 700 సీట్లు భర్తీ అయ్యేవి. దోస్త్ వచ్చిన తర్వాత ఆ సంఖ్య క్రమంగా పెంచుతూ వచ్చారు. తొలుత 2019-20 విద్యా సంవత్సరంలో 1020 సీట్లు, 2020-21లో 1320 సీట్లు, 2021-22లో 1500 సీట్లు, 2022-23 సంవత్సరంలో 1620 సీట్లు, 2023-24 విద్యా సంవత్సరానికి 1740కి సీట్ల సంఖ్య పెంచారు. ఈఏడాది మరిన్ని సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది. కళాశాలలో పెరిగిన సీట్లకు అనుగుణంగా ప్రవేశాలు కూడా అంతే స్థాయిలో కొనసాగుతున్నాయి.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

జిల్లా ఐడీ కళాశాల, తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం పొందడానికి దోస్త్ వెబ్‌సైట్ ద్వారా తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలోని విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ల సమయంలో టెక్నికల్ సమస్యలు తలెత్తినప్పుడు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చును.

తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

దోస్త్ షెడ్యూలు ఇలా

ఈ నెల 6 నుంచి 29వ తేదీ వరకు తొలి దశ రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. ఈ నెల 20 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు, ఈ ప్రక్రియలో భాగంగా మే 28న ప్రత్యేక వర్గాల వారి ధ్రువపత్రాల పరిశీలన, 29న ఎన్‌సీసీ, ఇతర వర్గాల పత్రాల పరిశీలన, జూన్ 6న తొలి దశ సీట్ల కేటాయింపు, జూన్ 7 నుంచి జూన్ 12 వరకు విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండో దశ రిజిస్ట్రేషన్లు రూ.400ల రుసుముతో జూన్ 6 నుంచి 13వ తేదీ వరకు ఉంటుంది. జూన్ 6 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్లు, 13న పీహెచ్‌సీ, ఎన్‌సీసీ వర్గాల పత్రాల పరిశీలన, అదే నెల 18న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. జూన్ 19 నుంచి 24వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌తో రెండో దశ ప్రవేశాలు పూర్తికానున్నాయి. అదే రూ.400ల రుసుముతో జూన్ 19 నుంచి 25 వ తేదీ వరకు మూడో దశ రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. జూలై 19 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 25న ప్రత్యేక వర్గాల పత్రాల పరిశీలన, అదే నెల 29న సీట్ల కేటాయింపు, 29 నుంచి జూలై 3వ తేదీ వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మూడు దశలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో జూన్ 29 నుంచి జూలై 5లోగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి 6వ తేదీ వరకు స్టూడెంట్ ఓరియంటేషన్ నిర్వహించనుండగా, జూలై 7 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.

ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య

పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందుకోవాలనే కల నెరవేర్చేందుకు ప్రభుత్వ కళాశాలలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వ కళాశాలలో అన్ని మౌలిక వసతులను కల్పించినందున విద్యార్థులు తమ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాలి. కాలానుగుణంగా విద్యార్థులకు అవసరమైన కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. అందుకు సంబంధించిన అధ్యాపకులను కూడా ఏర్పాటు చేశారు. తమకు ఇష్టమైన, అనువైన కోర్సులను ఎంచుకొని ప్రభుత్వ విద్యను అందిపుచ్చుకోవాలి. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలి. తారా కళాశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయి. వివిధ రకాల సర్టిఫికెట్ కోర్సులను కూడా అందిస్తున్నాం. ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు ఫిజికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్ ల్యాబొరేటరీలు, లైబ్రరీ, మైదానం, జిమ్‌లతో పాటు వివిధ విషయాలకు సంబంధించిన ల్యాబొరేటరీలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు చురుకుగా పని చేస్తున్నాయి. ఈ అవకాశాలను జిల్లాలోని విద్యార్థులందరూ వినియోగించుకోవాలి. దోస్త్ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ పేరును సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తొలి విడుతలో పేరు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు కేవలం రూ.200 రిజిస్ట్రేషన్ రుసుము చెల్లిస్తే సరిపోతుంది. ఆ తర్వాత దశ నుంచి రెండు, మూడు దశల్లో రూ.400ల రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

- డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, జిల్లా ఐడీ కళాశాల, తారా కళాశాల ప్రిన్సిపాల్

సదాశివపేటలో ఘనంగా బీరప్ప జాతర

సదాశివపేటలో ప్రారంభమైన బీరప్ప జాతర ఉత్సవాలు

సదాశివపేట, మే 17 : మల్లన్న, బీరప్ప ఉత్సవాలు పట్టణంలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం మల్లన్నకు బోనాలు తీసి లగ్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు విన్యాసాలు అందరినీ అలరించాయి. 18న గంగకు వెళ్లి బీరప్ప దేవుడిని తీసుకురావడం, 19న బీరప్పకు బోనాల ఊరేగింపు, 20న బీరప్ప లగ్నం, 21న బీరప్ప నగరవేళి, 22న కడపకడుగుట, భయ న్న ఉత్సవం, 23న బీరప్ప జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కుటుంబం బలి

- బైక్ అదుపు తప్పి భార్య, భర్త, కుమారుడు మృతి
- మృతులు మద్నూర్ మండలం పెద్ద తాడుగూర్ వాసులు

సునీత,శ్రీనివాస్, నగేశ్ మృతదేహాలు

అందోల్, మే 17 : రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని బలితీసుకున్నది. మృత్యువు భార్య, భర్తతో పాటు బాలుడు ప్రాణాలు హరించింది. శుక్రవారం మండలంలోని రంసాన్‌పల్లి శివారుల్లో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్ద తాడుగూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ (35), భార్య సునీత (30), కుమారుడు నగేశ్ (7)లతో కలిసి బైక్‌పై స్వగ్రామం పెద్ద తాడుగూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న బైక్ రంసాన్‌పల్లి శివారుకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన శ్రీనివాస్, సునీత ఘటనా స్థలంలోనే మృతి చెందగా, బాలుడు నగేశ్ జోగిపేట దవాఖానలో మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న బాలుడి ప్రాణాలు కాపాడేందుకు సీఐ అనిల్‌కుమార్ ప్రత్యేక చొరవచూపి వైద్యులతో సీపీఆర్ చేయించిన ఫలితం లేకుండా పోయింది. బతుకుదెరువు కోసం వెళ్తూ ఇలా రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంతో మృతుల బంధువులు దవాఖాన వద్ద బోరున విపించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆసానికుంట తనిఖీ

బొల్లారం, మే 17 : ఆసానికుంట కబ్జాపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా శాఖల అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ కమిషనర్ శాఖల అధికారులు తనిఖీ చేసి జాయింట్ సర్వే చేశారు. కుంట లో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లు ఎలాంటి కబ్జాకు గురి కాలేదని జాయింట్ సర్వే రిపోర్టులో అధికారులు తెల్పారు. కాగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 296 సర్వే నెంబర్‌లో ఆసానికుంట సమీపంలో కొన్నేండ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు వేసి కబ్జా చేశారని స్థానిక కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, తహసీల్దార్ భిక్షపతి సంయుక్తంగా అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఆసానికుంట చుట్టూ దాదాపు 3 ఎకరాల్లో కబ్జా చేసి దర్శన్ అగర్వాల్ రీసైక్లింగ్ పరిశ్రమకు 12 ఏండ్లుగా లీజుకు ఇచ్చారని నాయకులు లక్ష్మారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సార్లు ఫిర్యాదులపై స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు యజమానికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యక్తులపై ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. సర్వేయర్ రామభద్రం, టౌన్ ప్లానింగ్ మున్ని నవీన్, స్థానికులు పాల్గొన్నారు.

28న సదరం శిబిరం

సంగారెడ్డి కలెక్టరేట్, మే 17 : ఈ నెల 28న మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖాన ఆవరణలో సదరం శిబిరం నిర్వహించనున్నట్లు డీఏం అండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా ద్వారా స్లాట్స్ బుక్ చేసుకొని సదరం శిబిరానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

చర్చి జాతర ప్రారంభం

కోహీర్, మే 17 : జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చి జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వేడుకలను పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిపై జెండాల ఊరేగింపు, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థన చేశారు. తర్వాత ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. ఆదివారం వరకు జాతర కొనసాగుతుందని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ప్రారంభానికి నోచుకోని 'యోగా కేంద్రం'

మద్దూరు(ధూళిమిట్ట), మే17: మద్దూరు మండల కేంద్రంలోని ఆయుష్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన యోగా కేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సుమారు ఏడాది క్రితం రూ. 6లక్షలతో స్థానిక పీహెచ్‌సీకి అనుబంధంగా పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన ఈ యోగా కేంద్రం అలంకారప్రాయంగా మారింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి యోగా కేంద్రాన్ని ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మద్దూరులో ప్రారంభానికి నోచుకోని యోగా కేంద్రం

యువకుడు అదృశ్యం

గుమ్మడిదల, మే17 : తిరుపతికి వెళ్లి వస్తానని చెప్పిన యువకుడు అదృశ్యమైన సంఘటన బొంతపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్‌మౌరియా బైక్‌మెకానిక్. కుటుంబ సభ్యులతో బొంతపల్లిలో నివాసముంటున్నారు. అన్న శివసాగర్‌తో కలిసి ఉంటున్న రాహుల్ (29) ఈ నెల 6న తిరుపతికి వెళ్లివస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో రాహుల్ ఆచూకీ కోసం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వస్తుంది. దీంతో బంధువులకు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అన్న శివసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల పనులు ప్రారంభించాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సదాశివపేట, మే 17 : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సదాశివపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రూ. 2.15 కోట్లతో తరగతి గదులు, డైనింగ్ హాల్, బాలబాలికలకు మరుగుదొడ్లు పూర్తయ్యి ఏడాది గడిచినా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో సంబంధిత పాఠశాల నిరుపయోగంగా ఉన్నది. ఈ క్రమంలో ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల విద్యాధికారి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన కలెక్టర్ జూన్ 12న పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి అదనపు కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. డీఈవో వెంకటేశ్వర్లు, డీఈ రాం కుమార్, మండల విద్యాధికారి అంజయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఏఈ ప్రవీణ్ రెడ్డి, సీఆర్పీ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

పాఠశాల పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

వివాహిత అదృశ్యం

కుర్మ మౌనిక(ఫైల్)

కల్హేర్, మే 16 : వివాహిత అదృశ్యమైన సంఘటన బాచేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. బాచేపల్లి గ్రామానికి చెందిన కుర్మ మౌనిక (19) టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన మల్లయ్యతో రెండేండ్ల కింద వివాహమైంది. భార్యాభర్తల మధ్య విభేదాలతో పుట్టింటికి వచ్చిం ది. గత 10న తల్లి ఉపాధి హామీ పనికి వెళ్లడంతో మౌనిక బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ ల భించలేదు. తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశం తెలిపారు.

కృష్ణమూర్తిచారికి విశ్వసేవారత్న అవార్డు

అవార్డు అందుకుంటున్న కృష్ణమూర్తి చారి

రామచంద్రాపురం, మే17 : కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేసిన వివిధ సామాజిక సేవలకు గాను ఆయనకు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ఆధ్వర్యంలో విశ్వసేవారత్న అవార్డును అందజేశారు. శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకల్లో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి.

పుల్కల్, మే 17 : ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇసోజిపేట, గొంగ్లూరు గ్రామాల్లో రైతుల కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎప్పటి కప్పుడు ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకు వచ్చిన రైతులకు టాపర్లు ఇవ్వాలన్నారు. వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి కనుక రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్య త కూడా కేంద్రం నిర్వాహకులదేనన్నారు. రైతుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు.

బోగస్ ఓట్లను తొలిగించండి

తహసీల్దార్‌ను కోరిన గడ్డపోతారం గ్రామస్తులు

జిన్నారం, మే 17 : గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో బోగస్ ఓట్లు అధికంగా ఉన్నాయని, విచారణ జరిపి బోగస్ ఓట్లను తొలిగించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ భిక్షపతిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో గడ్డపోతారంతో పాటు చెట్లపోతారం, అల్లీనగర్, ప్రశాంత్‌నగర్, కిష్టయ్యపల్లి, దాచారం పునరావాస కాలనీలు ఉన్నాయని, పంచాయతీ పరిధిలో మొత్తం 3800 ఓట్లు ఉండగా, ఈనెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 2600 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. డబుల్ ఓట్లు ఉండడంతో ఇతర రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు వెళ్లడంతో ఇక్కడ ఓటు హక్కును వినియోగించుకోలేదన్నారు. విచారణ జరిపి అనర్హుల ఓట్లను తొలిగించాలని కోరారు. అలాగే కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారి అడ్రస్సులు మండలంలోని వివిధ గ్రామాల ఓటరు జాబితాలో వచ్చాయని, వాటిని సరి చేయాలని కోరారు. వీరేశంగౌడ్, నాగరాజు, బాలయ్య, రాజగోపాల్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతి కుమారి , పాల్గొన్న కలెక్టర్లు

సంగారెడ్డి కలెక్టరేట్/సిద్దిపేట అర్బన్, మే 17 : పునఃప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టి మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, సిద్దిపేట నుంచి కలెక్టర్ ఎం. మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలల పునఃప్రారంభించేందుకు మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని.. ఆలోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పని సరిగా పూర్తి చేసి పాఠశాలలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్లను ఆదేశించారు. బాలికల సంఖ్య ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తప్పకుండా ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, వీటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. లోక్ సభ ఎన్నికలు ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునఃప్రారంభించాలని, మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు తరుచూ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన మార్పులు ధరణి మాడ్యుల్స్‌లో చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. 5 రోజుల పాటు అకాలు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సీఎస్ సూచించారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 68,236 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఇందులో 7,485 మంది రైతులకు రూ.89.69 కోట్లను చెల్లించడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, డీఆర్డీవో జ్యోతి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ కొండలరావు, డీఈవో వెంకటేశ్వర్లు, సిద్దిపేట జిల్లా నుంచి జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనూజ, డీఎం సివిల్ సప్లై హరీశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హత్నూర, మే 17 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. హత్నూర ఎస్సై సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్లా తాండ పంచాయతీ పరిధిలోని పీరియ తండాకు చెందిన పాప్య (25) నిరుపేద కుటుంబం. భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం పని కోసం తన ద్విచక్ర వాహనంపై జోగిపేట వెళ్తుతుండగా సిరిపురం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టింది. పాప్య తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సాంకి ఫిర్యాదు మేరకు మృతద